RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

అరుణాచల్ ప్రదేశ్ మాదే..



4లో.

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పనిచేయుటకు
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.
ఎడిటర్ : బిర్రు కరుణాకర్
Cell: 9701249103

సంపుటి - 1 సంచిక - 167 బుధవారం13 మార్చి 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# 12 కంటే ఎక్కువ లోక్‌సభ సీట్లే లక్ష్యం

**వారసత్వ పార్టీల పాలన కుంభకోణాలమయం**

**ఎంఐఎం చేతిలో కాంగ్రెస్, భారాస కీలుబొమ్మలు**

**సీఏఏతో ఏ ఒక్కరి పౌరసత్వమూ రద్దు కాదు**

**భాజపా అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా**



2లో.

**(జర్నలిస్ట్ వార్త)/** హైదరాబాద్:

విజయం సాధించేవరకు విశ్రమించొద్దని భాజపా శ్రేణులకు అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో భాజపాకే మళ్లీ అధికారం దక్కుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీని మూడోసారి ప్రధానిగా చూడాలని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. మహిళలు పెద్దఎత్తున మద్దతు తెలుపుతున్నారన్నారు. భాజపాకు 400 సీట్ల వరకూ వస్తాయని చెప్పారు. తెలంగాణలో 12 కంటే ఎక్కువ లోక్‌సభ స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యమన్నారు. కుటుంబ పార్టీలైన కాంగ్రెస్, భారాసలది అవినీతి చరిత్ర అని.. వారి పాలనంతా కుంభకోణాలమయమేనని ఆరోపించారు. అవి ఓటు బ్యాంకు రాజకీయాలే చేస్తాయని, భాజపా ఎప్పుడూ అలాంటి రాజకీయాలు చేయదని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)తో దేశంలోని ఏ ఒక్కరి పౌరసత్వం పోదని స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బూత్ కమిటీల అధ్యక్షులతో నిర్వహించిన విజయసంకల్ప సమ్మేళనంలో, సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో భాజపా సోషల్ మీడియా ఇన్‌ఛార్జుల సమావేశంలో అమిత్‌షా ప్రసంగించారు.



# ప్రజల గళమౌతాం.. భవిష్యత్తుకు బలమౌతాం!

భూమి.. ఆకాశం ఉన్నన్ని రోజులు భారాస ఉంటుంది

నేను సీఎంగా ఉన్నప్పుడు పచ్చని పొలాలు, కరెంట్ ఉండె..

ఇప్పుడేమయ్యాయి? సీఎం మాట్లాడే భాష ఇదా..?

కరీంనగర్ కదనభేరిలో కేసీఆర్

2లో.

పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరేయాలని పిలుపు

# విద్యుత్ ప్రాజెక్టుల అక్రమాలపై విచారణ కేబినెట్ నిర్ణయం



2లో.


# ఐదేళ్లలో కోటి మంది మహిళా కోటీశ్వరులు

- తాను బాధ్యత తీసుకుంటున్నానన్న సీఎం రేవంత్

వడ్డీలేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు వెల్లడి

మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సులో ప్రసంగం

**(జర్నలిస్ట్ వార్త):/** హైదరాబాద్: ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. రా ష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్ జీలు) ప్రస్తుతం ఉన్న 63 లక్షల మంది మహిళలను కోటికి పెంచడమే కాకుండా ప్రతి ఒక్కరిని కోటీశ్వ రులను చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళల ను లక్షాధికారుల్ని చేసే లక్ష్యంతో పావలా వడ్డీ రుణాలను ప్రారంభించారని, ఇప్పుడు ప్రతి మహిళ ను కోటీశ్వరురాలిని చేసే లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో నిలిచి పోయిన వడ్డీలేని రుణాల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.




2లో.

# సెప్టెంబర్ 17న హైదరాబాద్ విముక్తి దినోత్సవం

**అధికారికంగా నిర్వహించనున్న కేంద్రం : గెజిట్ నోటిఫికేషన్ జారీ**

**(జర్నలిస్ట్ వార్త):** న్యూఢిల్లీ: ప్రతి ఏటా సెప్టెంబర్ 17ను 'హైదరాబాద్ విముక్తి దినోత్సవం'గా జరుపుతామని కేంద్రం మంగళవారం ప్రకటించింది. 1947 ఆగసు 15న భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కూడా 13 నెలల దాకా హైదరాబాద్‌కు స్వాతంత్ర్యం లభించలేదని, నిజాంల పాలనలో ఉండిందని ఒక నోటిఫికేషన్‌లో కేంద్ర హోం శాఖ తెలిపింది. 'ఆపరేషన్ పోలో' పేరుతో పోలీసు చర్య తర్వాత 1948 సెప్టెంబర్ 18న అది విముక్తి పొందింది. 'సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా జరపాలన్న డిమాండ్ ఆ ప్రాంత



ప్రజలనుంచి చాలా కాలంగా ఉంది. హైదరాబాద్‌ను విముక్తి చేసిన అమరవీరులను గుర్తు చేసుకోవడం కోసం, అలాగే యువతలో దేశభక్తిని రగిలించడం కోసం ప్రతి ఏడాది సెప్టెంబర్ 17ను హైదరాబాద్ విముక్తి దినోత్సవంగా జరపాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది' అని ఆ నోటిఫికేషన్ పేర్కొంది. హైదరాబాద్ విముక్తి దినోత్సవానికి గుర్తుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా ఏటా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు కూడా.

# కావాలనే చిన్నపీటపై కూర్చున్నా



నాకు ఎలాంటి అవమానం జరగలేదు ద

సోషల్ మీడియాలో అర్థం లేని వ్యాఖ్యలు

సింగరేణిలో ఈ ఏడాది 1900 ఉద్యోగాలు భర్తీ

: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

4లో.

# ప్రజల గళమౌతాం.. భవిష్యత్తుకు బలమౌతాం!

**(జర్నలిస్ట్ వార్త): కరీంనగర్ – రాంపూర్, :** ప్రజాసంక్షేమం కోసం పుట్టిన పార్టీ తమదని.. భూమి, ఆకాశం ఉన్నన్ని రోజులు భారాస ఉంటుందని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. 'తెలంగాణ ప్రజలకు మేమే గళమౌతాం.. భవిష్యత్తుకు బలమౌతాం' అని చెప్పారు. ఇదే కరీంనగర్ గడ్డ మీద నుంచి సింహగర్జన రూపంలో ఎలుగెత్తి రాష్ట్రాన్ని సాధించామని.. మళ్లీ ఇదే వేదిక నుంచి ప్రజాగర్జనగా పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతున్నామన్నారు. కేసీఆర్ సీఎంగా చాఉన్నప్పుడు పచ్చని పొలాలు.. కరెంట్ ఉండేవని.. ఇప్పుడు ఎందుకు మాయమయ్యాయని ప్రశ్నించారు. ఇదంతా అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే జరుగుతోందన్నారు. మంగళవారం కరీంనగర్‌లో కదనభేరి పేరిట భారాస నిర్వహించిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగించారు.

**ఏం జరుగుతోందో అందరికీ తెలుసు**

"రాజకీయాల్లో పరిణామాలు మారుతుంటాయి. మనం మంచిగా పనిచేశాం. అత్యాశకో.. దురాశకో కొన్నిసార్లు ప్రజలు మోసపోతారు. మొన్నటి ఎన్నికల్లో కూడా అలాగే మోసపోయి కాంగ్రెస్‌ను గెలిపించారు. వంద రోజుల్లోనే ఏం జరుగుతోందో మీ అందరికీ తెలుసు. గ్రామాల్లో వారి పనితీరు స్పష్టంగా కనిపిస్తోంది. రూ.15 వేల రైతుబంధు ఇయ్యలేదు. తులం బంగారం ఇయ్యలేదు. పైగా రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతామని ఓ మంత్రి అంటున్నారు.రైతుల చెప్పులు మరింత బందోబస్తుగా ఉంటాయని నేను చెప్పాను. అదే రైతులు తిరగబడితే ఏమవుతుందో చెప్పాను. ఆరు గ్యారంటీలు, కరెంట్, నీళ్లు అడిగితే.. వాళ్లేమేమో మాట్లాడుతున్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి మాట్లాడే తీరు సబబేనా.? అనేది ప్రజలు ఆలోచించుకోవాలి. ఇంత అసహనమా? ఇది ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన భాషనా? ఈ కరీంనగర్ గడ్డ నుంచి తెలంగాణ ప్రజలకు పిలుపునిస్తున్నా. దయచేసి ప్రజలు ఆలోచించాలి. సీఎం మాట్లాడే మాటలా ఇవి? నేను ఉద్యమ సమయంలో తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లను విమర్శించాను. పదేళ్లలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇటువంటి దురుసు మాటలు మాట్లాడలేదు. రాష్ట్రం తెచ్చిన తరువాత



బ్రహ్మాండమైన పాలనను సాగించుకున్నాం. నేను అహోరాత్రులు కష్టపడి రాష్ట్రం బాగుండాలని చూశా. నేను పదవి నుంచి దిగిపోయానో.. లేదో.. మిషన్ భగీరథ, కరెంట్ విషయంలో కాంగ్రెసోళ్లు కట్క బంద్‌జేశారు.

**వాళ్లకు ఓటేస్తే గ్యారంటీలను అమలు చేయరు..**

మొన్నటి ఎన్నికల్లో నాకు బ్రేకు వేసి ఇక్కడే ఆపారు. ఒకవేళ రాష్ట్రంలో గెలిస్తే ఇప్పటికే సగం దేశంలో ప్రభావం చూపేవాళ్లం. చిన్న దెబ్బ తగిలింది. పేగులు తెగేదాక కొట్లాడే శక్తి నాకుంది. కరీంనగర్ నుంచి ఒక సందేశాన్ని ప్రజలకిస్తున్నా. పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేద్దాం. మళ్లీ మోసపోవద్దు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. హామీలు నెరవేర్చకున్నా వేశారని వాళ్లనుకుంటారు. అన్ని గ్యారంటీలకు ఎగనామం పెడతారు. అందుకే ఈ సమయంలో కర్రుకాల్చి కాంగ్రెస్‌కు వాత పెట్టాలి. భారాస ఎంపీలు అంతటా గెలవాలి. భాజపా తరపున గత ఎన్నికల్లో నలుగురు ఎంపీలు గెలిచి చేసిందేమీ లేదు. కొత్త జిల్లాలకు నవోదయ పాఠశాలలపై ఎన్నిసార్లు విన్నవించినా కేంద్రం స్పందించలేదు.

**మూడు నెలల్లో ఇంతటి మార్పు..**

భారాస పాలనలో ఐటీ, పరిశ్రమలు, తలసరి ఆదాయం, జీడీపీ అన్నింటా రాష్ట్రాన్ని ముందుంచాం. మూణ్నెళ్లలో ఇంతటి మార్పు వచ్చింది. పంటలు ఎండిపోయే పరిస్థితితో నా కళ్లల్లో నీళ్లు వస్తున్నాయి. సమైక్య రాష్ట్రం కన్నా ఇప్పుడు బాధలు ఎక్కువ కనిపిస్తున్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దిల్లీ పెద్దల వద్ద తాకట్టు పెడుతున్నారు. డబ్బు మూటలు గుంజుతున్నారు. దిల్లీకి సూటుకేసులు పంపుతున్నారు. మూణ్నెళ్లలో 9 సార్లు దిల్లీకి వెళ్లారు. అందుకనే ప్రజల పక్షాన పోరాడే భారాస ఎంపీలే పార్లమెంట్‌కు వెళ్లాలి. ఒకరో ఇద్దరో పార్టీ నుంచి పోయినంత మాత్రాన ఏం కాదు. పార్టీ ఖతమైందని కొన్ని ఛానెళ్లు ప్రచారం చేస్తున్నాయి. వీటికి భయపడం. భూమి ఆకాశం ఉన్నన్ని రోజులు గులాబీ జెండా ఉంటుంది. కాంగ్రెస్, భాజపా వాళ్ల గుండెల నిండా తెలంగాణ అని నినదించరు. మనమే అనగలుగుతాం. పోలీసులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే మన వాళ్లని బెదిరిస్తున్నారు. పోలీసులకు రాజకీయాలు ఎందుకు? మేం పదేళు ్లన్నప్పుడు మాపై కొందరు తీవ్ర విమర్శలు చేసినా.. ఎవరి పాపం వాళ్లదని వదిలేశాం. ఇలాగే పోలీసులను మేము వాడుకుని ఉంటే.. ఒక్క కాంగ్రెస్ నాయకుడైనా మిగిలేవారా?" అని కేసీఆర్ పేర్కొన్నారు. కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్ అభివృద్ధి కోసం, రాష్ట్రం కోసం తాను పార్లమెంట్‌లో 106 ప్రశ్నల్ని సంధించానన్నారు. మరోసారి అవకాశమిస్తే ప్రజలకు మేలు చేస్తానని చెప్పారు. సమావేశంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గంగుల కమలాకర్, సంజయ్, కౌశిక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# 12 కంటే ఎక్కువ లోక్‌సభ సీట్లే లక్ష్యం

**(జర్నలిస్ట్ వార్త):** కాంగ్రెస్, భారాస, మజ్లిస్.. మూడూ కుటుంబ పార్టీలే. వారసత్వ రాజకీయాలే వాటి లక్ష్యం. కాంగ్రెస్‌లో నెహ్రూ నుంచి మొదలుపెడితే ఆ కుటుంబ సభ్యులే అధికారంలో ఉంటూ వచ్చారు. పదేళ్ల కాలంలో తెలంగాణలో భారాసలో కూడా అదే తీరు కొనసాగింది. ఆ పార్టీల జెండాలు వేరైనా.. ఎజెండా ఒక్కటే. ఆ నేతలకు వారి వారసులు, కుటుంబ సభ్యుల ప్రయోజనాలే ముఖ్యం తప్ప రాష్ట్ర, దేశాభివృద్ధి వారి ఎజెండాలో ఉండదు. ఎంఐఎం చేతిలో కాంగ్రెస్, భారాస కీలుబొమ్మలు. మజ్లిస్ ఎజెండాతోనే అవి పనిచేస్తున్నాయి. భారాస, కాంగ్రెస్, మజ్లిస్‌లు.. నిజాం పాలన నీడ నుంచి తెలంగాణను విముక్తి చేయగలుగుతాయా? తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఏం చేసింది? మజ్లిస్‌ను బుజ్జగించే క్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్యేను తాత్కాలిక స్పీకర్‌గా చేసింది. త్వరలోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నేతల అవినీతి చిట్టా పంపిస్తా. దానిపై సమాధానం చెప్పిన తర్వాతే భాజపాపై విమర్శలు చేయాలి. నేను చెప్పేది తప్పయితే రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి సమాధానం చెప్పాలి? కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం, కామన్వెల్త్ క్రీడల కుంభకోణం, 2జీ కుంభకోణం, శారదా చిట్‌ఫండ్, ఎయిర్‌సెల్–మాక్సిస్, యాంత్రిక్స్, జమ్మూకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్, ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలు కుంభకోణం, బోఫోర్స్ కుంభకోణం జరగలేదా? కాంగ్రెస్ రూ.12 లక్షల కోట్ల అవినీతికి పాల్పడింది. భారాస పాలన కూడా అవినీతిమయమే. రూ.4 వేల కోట్ల మియాపూర్ భూకుంభకోణం, ఓఆర్ఆర్ కుంభకోణం, రూ.40 వేల కోట్ల కాళేశ్వరం కుంభకోణం, మద్యం కుంభకోణం.. ఇలా చెబుతూ పోతే అనేకం ఉన్నాయి. రూ.వేల కోట్ల అవినీతికి, కుంభకోణాలకు పాల్పడే పార్టీలు దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాయా? సీఎంగా, ప్రధానిగా 23 ఏళ్ల పాలనలో నరేంద్ర మోదీపై ప్రత్యర్థులు 25 పైసల అవినీతి ఆరోపణలు కూడా చేయలేకపోయారు. అవినీతి రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా ఆయన పదేళ్లుగా సుస్థిర పరిపాలన అందిస్తున్నారు.

తెలంగాణ అభివృద్ధి.. ప్రజల సంక్షేమమే మా లక్ష్యం. మోదీ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు రూ.2.5



లక్షల కోట్లు ఇచ్చింది. రైల్వే, మెట్రో, జాతీయ రహదారులు, పెట్రోలియం, విమానయాన సంస్థలు, ప్రాజెక్టుల ద్వారా మరో రూ.5 లక్షల కోట్లను అభివృద్ధికి వెచ్చించింది. భాజపా కార్యక్రమాలు, విజయాల సమాచారాన్ని ప్రతి ఇంటికీ సామాజిక మాధ్యమాలు చేర్చాలి. పార్టీపై తప్పుడు ప్రచారం జరిగితే ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలి. సంపూర్ణ అభివృద్ధి సాధించిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే క్రతువులో కార్యకర్తలంతా భాగస్వాములు కావాలి.

**మేం చెప్పినవన్నీ చేశాం**

నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన భారాస ఒక్క హామీని నెరవేర్చలేదు. లక్ష మందికి ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇవ్వలేదు. ప్రొఫెసర్ల పోస్టులు భర్తీ చేయలేదు. 40 లక్షల మంది విద్యార్థులకు ఉచిత విద్య, 7 లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పి నెరవేర్చలేదు. ఇక పేదరిక నిర్మూలన పేరుతో కాంగ్రెస్ కాలయాపన తప్ప.. ఆ దిశగా ఏమీ చేయలేదు. ఇచ్చిన ప్రతి హామీని కేంద్రంలోని భాజపా ప్రభుత్వం నెరవేర్చింది. ప్రతి పేదవాడికి నెలకు ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇస్తోంది. 14 కోట్ల ఇళ్లకు రక్షిత మంచినీరు, 10 కోట్ల ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, 12 కోట్ల మరుగుదొడ్లు, 4 కోట్ల ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు ఏటా ప్రతి రైతుకు రూ.ఆరు వేలు ఇస్తోంది. ఆర్టికల్ 370ని రద్దు చేశాం. ఇప్పుడు శ్రీనగర్ లాల్‌చౌక్‌లో త్రివర్ణ పతాకం రెపరెపలాడుతోంది. అయోధ్యలో రామమందిరం నిర్మించాం. ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశాం. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాం. పదేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజు ఉగ్రవాదులు దాడులు చేసి పాకిస్థాన్‌కు వెళ్లిపోయేవారు. మోదీ ప్రభుత్వం రాగానే పరిస్థితి మార్చాం. సర్జికల్, ఎయిర్ స్ట్రైక్‌లతో పాకిస్థాన్‌లోకి వెళ్లి మరీ ఉగ్రవాదులను తుదముట్టించిన ఘనత మోదీ ప్రభుత్వానిది. జీ–20, చంద్రయాన్‌తో ప్రపంచ దేశాల్లో దేశ ప్రతిష్ఠ ఇనుమడించింది. 14 దేశాలు ఆయా దేశాల అత్యున్నత పౌర పురస్కారాలను మోదీకి ఇచ్చాయి. ఇది ఆయనకే కాదు.. భారతీయులందరికీ దక్కిన గౌరవం" అని అమిత్‌షా పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర నేతలు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఎంపీలు డి.అర్వింద్, రాములు, బి.బి.పాటిల్, శాసనసభాపక్షనేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రాజెక్టుల అక్రమాలపై విచారణ

## కేబినెట్ నిర్ణయం

**(జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ : కొత్త రేషన్ కార్డుల జారీకి రేవంత్ రెడ్డి కేబినెట్ ఆమోదం తెలిపింది. అర్హులైన వారందరికీ తొందరలోనే తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. రేషన్ కార్డు లేకుండా ఆరోగ్యశ్రీ అమలుకు కూడా కసరత్తు చేస్తున్నారు. సచివాలయంలో రేవంత్ అధ్యక్షతన నేడు సమావేశమైన మంత్రివర్గం పలు అంశాలపై దాదాపు రెండున్నర గంటలసేపు చర్చించింది. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పలు నిర్ణయాలకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.. మంత్రి వర్గ నిర్ణయాలను రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాకు వివరించారు. 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలపై సానుకూలంగా కేబినెట్ స్పందించింది.. వారికి తగిన న్యాయం చేయాలని నిర్ణయించింది."ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మొదటి విడతగా 4.56లక్షల ఇళ్లు ఇవ్వాలని నిర్ణయించాం. మరికొన్ని గ్యారంటీలు అమలు చేయాలని నిర్ణయించాం. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ సహా 16 కార్పొరేషన్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్ చుట్టూ జిల్లాల వారీగా స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ సౌకర్యం. 25 నుంచి 30 ఎకరాల్లో అమ్ముకునే సౌకర్యం కల్పిస్తాం. జస్టిస్ పీసీ చంద్రఘోష్ నేతృత్వంలో కాళేశ్వరంపై విచారణ. వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని కమిటీకి సూచన. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టులు, విద్యుత్ కొనుగోళ్ల అంశంపై విశ్రాంత జడ్జి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణకు కేబినెట్ నిర్ణయం. రెండు రోజుల్లో 93శాతం రైతు బంధు ఇవ్వాలని నిర్ణయించాం" అని వివరించారు.

### తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయాలు ఇవే..

- కొత్త రేషన్ కార్డుల జారీకి ఆమోదం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలకు కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు
- 2008 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలపై కసరత్తుకు నిర్ణయం
- 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.22,500 కోట్లు కేటాయింపు
- ఔటర్ చుట్టూ మహిళా రైతు బజార్లు
- కాళేశ్వరంపై న్యాయ విచారణకు కమిటీ ఏర్పాటు.. విచారణ కమిటీ చైర్మన్‌గా జస్టిస్ పినాకిని చంద్రబోస్
- విద్యుత్ కొనుగోళ్లపైనా మరో కమిటీ.. చైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి
- రెండు రోజుల్లో 93 శాతం రైతుబంధు నిధులు పంపిణీ చేయాలని నిర్ణయం
- భద్రాద్రి, యాదాద్రి పవర్ ప్లాంట్ అక్రమాలపై విచారణ జరపాలని నిర్ణయం

# ఐదేళ్లలో కోటి మంది మహిళా కోటీశ్వరులు

**(జర్నలిస్ట్ వార్త):**
కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే తెలంగాణ బంగారు తెలంగాణ, ధనిక తెలంగాణ, అభివృద్ధి చెందిన తెలంగాణ అవుతుందని, మహిళలు తమ పిల్లలను డాక్టర్లు, ఐఏఎస్‌లను చేసుకోగలరని అన్నారు. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 'మహాలక్ష్మి స్వశక్తి మహిళా సదస్సు'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

'పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణలో ఆడబిడ్డల ను పట్టించుకోలేదు. పావలా వడ్డీ, సున్నా వడ్డీ ఇవ్వలేదు. అందుకే మా ఆడబిడ్డలు కంకణం కట్టుకుని ఎన్నికల్లో కేసీఆర్‌ను బండకేసి కొట్టారు. వంద మీటర్ల గొయ్యి తీసి పాతిపెట్టారు. ఆడబిడ్డల ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. నేను సీఎం అయ్యా. అధికారంలోకి వచ్చిన వెంటనే గతేడాది సెప్టెంబర్ 17న సోనియాగాంధీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు ప్రారంభించాం. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తే, ఇప్పటివరకు 23 కోట్ల మంది వినియోగించుకున్నారు.

కానీ కేసీఆర్, హరీశ్, కవిత, కేటీఆర్ కిరాయి ఇచ్చి ఆటో డ్రైవర్లతో ధర్నాలు చేయిస్తున్నారు. ఎవరు అడ్డు వచ్చినా సరే.. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కొనసాగిస్తాం. ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన రాజీవ్ ఆరోగ్యశ్రీని కేసీఆర్ ఎటుగాకుండా చేశారు. మహిళలను కట్టెల పొయ్యి కష్టాల నుంచి గట్టెక్కించేందుకు గతంలో దీపం పథకం ద్వారా సోనియాగాంధీ రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తే, ప్రధాని నరేంద్ర మోదీ, కేసీఆర్ కలిసి దానిని రూ.1200కు పెంచి మళ్లీ కట్టెల పొయ్యికి మళ్లే పరిస్థితి కల్పించారు. అందుకే ఇప్పుడు రూ.500లకే మహిళలకు గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. గృహలక్ష్మి పథకం ద్వారా పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం..' అని రేవంత్ తెలిపారు.

'ఎస్‌హెచ్‌జీల మహిళలు తయారు చేసే ఉత్పత్తుల కు మార్కెటింగ్ సౌకర్యం లేదనే విషయం నా దృష్టికి



వచ్చింది. రాబోయే నెల రోజుల్లో శిల్పారామం పక్కన ఎస్‌హెచ్‌జీల మహిళలకు వంద స్టాళ్లు ఏర్పా టు చేస్తాం. మీరు తయారు చేసిన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తాం. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ కూడా మహిళా ఉత్పత్తుల విక్రయానికి బజార్లు ఏర్పాటు చేస్తాం. టాటా, బిర్లాలు, అదానీ, అంబానీలతో పోటీ పడే విధంగా మహిళలు రాణించేలా కృషి చేస్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.'ఇందిరమ్మ ఇళ్లు ఎన్నికలు అయిపోయిన తరువాత ఇద్దామనుకున్నాం. కానీ మహిళల కోసం భద్రాద్రి రామచంద్ర స్వామి ఆశీస్సులతో ఈ పథకాన్ని ప్రారంభించుకున్నాం. కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఆశ చూపి మహిళలను మోసం చేసిండు. మేం మొత్తం రూ.22,500 కోట్లతో ఇల్లు కట్టుకునే పేదలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించబోతున్నాం..' అని రేవంత్ తెలిపారు.'మా ప్రభుత్వాన్ని పడగొడతామంటూ కొందరు చిందులు వేస్తున్నారు. కేసీఆర్, మోదీలు కుట్రలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి కుర్చీలో దొరలే కూర్చో వాలా? రైతు బిడ్డ కూర్చోకూడదా? నేనేం పాపం చేశా? మీ అవినీతి సొమ్ములో షేర్ అడిగానా? నేనే మన్నా అయ్య పేరు చెప్పుకొని, విరాసత్ రాయించుకొని ముఖ్యమంత్రి అయ్యానా? ఎవరి కుర్చీనైనా గుంజుకున్నానా? రేవంత్‌ను, ప్రభుత్వాన్ని పడగొడ తామని ఎవరైనా వస్తే.. మా ఆడబిడ్డలు చీపురు కట్టలు మర్లేసి కొడతారు. కొద్దిరోజుల్లో 10 లక్షల మంది ఆడబిడ్డలతో కవాతు చేస్తాం. మా సైన్యం మీరే.. మా బలగం మీరే..' అని సీఎం అన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాప్ మూసివేత

## క్లోజింగ్ సమయానికి ముందే షాపుకి తాళాలు




వర్ధన్నపేట, మార్చి12 **(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో మూడు వైన్ షాపులు, రెండు బార్ షాపులు ఉన్నాయి. ఐనప్పటికీ లక్ష్మి వైన్ షాప్ లో మద్యం నిలువలు లేనికారణంతో క్లోజింగ్ సమయానికి ముందే షాపు యజమాన్యం షాపుకి తాళాలు వేసి వెళ్ళిపోయారు. పట్టణ కేంద్రంలో మూడు వైన్ షాపులు రెండు బార్లు ఉన్నప్పుడు ఆ షాపులో మాత్రమే మద్యం అయిపోవడానికి కారణమేంటి..? అంటే ఆ స్థాయిలో బెల్ట్ షాపులకు మద్యం తరలిస్తూ బెల్ట్ దందాను పెంచి, పోషిస్తున్నారని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకోవాలని నెపంతో ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి ముందే షాపు మూసివేసి యాజమాన్యం వెళ్ళపోవడం పట్ల ఎక్సైజ్ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం మరిన్ని అనుమానాలకు దారితీస్తుంది. ఇట్టి విషయమై నిర్దేశిత సమయానికి ముందే వైన్ షాప్ మూసి వేయడం పట్ల సంబంధిత అధికారులు సమాధానం చెప్పాలి, అక్రమంగా అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలి, ఏ షాపు నుంచి బెల్ట్ షాపులకు మద్యం విక్రయిస్తున్నారో గ్రహించి ఆ షాపు లైసెన్స్ రద్దు చేసే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# కరువు పాపం కాంగ్రెస్ దే

### కేసీఆర్ ఉంటే కరువొచ్చేది కాదు




**సూర్యాపేట (జర్నలిస్ట్ వార్త):** ఎమ్మెల్యేలను కొనేందుకు గేట్లు తెరవడం కాదు ఎండుతున్న పంటలకు సాగర్ , శ్రీశైలం కాళేశ్వరం గేట్లు ఎత్తండి ఎమ్మెల్యేలను కొనాలనే సోయి తప్ప ప్రజల కష్టాలపై కాంగ్రెస్ కి పట్టింపు లేదు ఇక ఎన్ని అబద్దాలు చెప్పిన ప్రజలు కాంగ్రెస్ ని నమ్మే పరిస్థితి లేదు. చరిత్రలో మూడు నెలల్లో విఫలమైన ప్రభుత్వం ఇదే కుంగిన మెడిగడ్డ పిల్లర్లకు నీళ్ళు ఎత్తిపోసుకోవడానికి సంబంధం లేదు ఇవ్వాల్టికి కూడా కాళేశ్వరంలో 4 వేల క్యూసెక్కుల నీటి లభ్యత ఉంది

సాగు నీరు లేక రైతుల కంట కన్నీళ్లు కారుతున్నాయి కరువుతో అల్లాడుతున్న రైతులను ఓదార్చే నాయకులే లేరు తక్షణమే కరువు సమీక్షలు పెట్టాలి. సూర్యాపేట ఎమ్మెల్యేలను కొనేందుకు గేట్లు తెరవడం కాదు ఎండుతున్న పంటలకు సాగర్ , శ్రీశైలం కాళేశ్వరం గేట్లు ఎత్తండి అనీ సూర్యాపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గేట్లు తెరిస్తే బీ.ఆర్.ఎస్ ఖాళీ అవుతుందన్న సీ.ఎం రేవంత్ వ్యాఖ్యలపై సూర్యాపేట జగదీష్ రెడ్డి స్పందించి కౌంటర్ వేశారు. ఎమ్మెల్యేలను కొనాలనే సోయి తప్ప ప్రజల కష్టాలపై కాంగ్రెస్ కి పట్టింపు లేదన్నారు. వ్యాపారులను బెదిరించి ఢిల్లీకి ముడుపుల సోయి తప్ప సీ.ఎం కి వేరే యావ లేదన్నారు.ఇక ఎన్ని అబద్దాలు చెప్పినా, ప్రజలు కాంగ్రెస్ ని నమ్మే పరిస్థితి లేదన్నారు. కరువు పాపం కాంగ్రెస్ దే అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలే కాంగ్రెస్ గేట్లు బద్దలుగొట్టేలా ఉన్నారని అన్నారు.మూడు నెలల్లో విఫలమైన ప్రభుత్వంగా తెలంగాణా లో ని కాంగ్రెస్ నిలబడిందని అన్నారు. కే.సీ.ఆర్ ఉంటే కరువొచ్చేది కాదన్నారు.డ్రామాలాడి ప్రభుత్వం నడపడం మానివేసి ఇప్పటికైనా దమ్ముంటే సాగు నీరు ఇవ్వండి , కరువు సమీక్షలు చేయండి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాత వెలుగులు పోయి చీకట్లు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంట్ పోయింది , సాగు తాగు నీరు లేదు , పంట పెట్టుబడి లేక తిరోగమన మార్పు వచ్చిందన్నారు.కాంగ్రెస్ రాజకీయ కక్ష సాధింపు తోనే తెలంగాణ కు కరువు వచ్చింది అన్నారు.కుంగిన మెడిగడ్డ పిల్లర్లకు నీళ్ళు ఎత్తిపోసుకోవడానికి సంబంధం లేదన్నారు.ఇవ్వాల్టికి కూడా కాళేశ్వరంలో 4 వెల క్యూసెక్కుల నీటి లభ్యత ఉందన్నారు. మీ కర్ణాటక మిత్రులతో మాట్లాడి కృష్ణా నుండి 10 టీ.ఎం.సీ. ల నీటిని తెప్పించాలి అని డిమాండ్ చేశారు.సాగు నీరు లేక రైతుల కంట కన్నీళ్లు కారుతున్నాయనీ అన్నారు. రాష్ట్రం లో కరువుతో అల్లాడుతున్న రైతులను ఓదార్చే నాయకులే లేరనీ మండిపడ్డారు.తక్షణమే కరువు సమీక్షలు పెట్టాలని జగదీష్ రెడ్డి ప్రభుత్వాన్నీ డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్‌కు మేం వ్యతిరేకం కాదు... కానీ : బండి సంజయ్ వ్యాఖ్య




**(జర్నలిస్ట్ వార్త):** బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్, కాంగ్రెస్ కేడర్‌కు వ్యతిరేకం కాదని... ఆ పార్టీల నాయకత్వంతో మాత్రమే విభేదిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని కాకుండా కాంగ్రెస్‌ను గెలిపించినందుకు తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారన్నారు. తమ కోసం కొట్లాడింది బీజేపీ... ఆ పార్టీ కార్యకర్తలు అయితే గత ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించామని ఆవేదన చెందుతున్నారన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే బాగుండేదని ఇప్పుడు అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి, మోదీని బలపరచాలని భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల కార్యకర్తల ఆలోచన కూడా అలాగే ఉందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పాలనలో సర్పంచ్‌ల బతుకులు బర్బాత్ అయ్యాయని... కాంగ్రెస్ పాలన వచ్చినా ఏమాత్రం లాభం లేదన్నారు. బీఆర్ఎస్ ఇక్కడ లేదు... అక్కడా లేదని తెలిపారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేసి అందులో సక్సెస్ అయిందని బండి సంజయ్ అన్నారు. అందుకే ప్రజలు ఆ పార్టీని గెలిపించారన్నారు. కానీ అలాంటి అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఆరు గ్యారెంటీలను ప్రజలు విశ్వసించరని గ్రహించిన కాంగ్రెస్ మరోసారి బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని ప్రచారం చేస్తోందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కేసీఆర్ పెద్ద డ్రామా ఆర్టిస్ట్ అని విమర్శించారు.

# మహిళా సదస్సుకు తరలి వెళ్లిన రాయపర్తి మహిళలు



రాయపర్తి, మార్చి12(జర్నలిస్ట్ వార్త): అంతర్జాతీయ మహిళా దినోత్సవ బహిరంగ సభకు మంగళవారం మహిళా సంఘాల వారు భారీగా బయల్దేరారు. ఈ సందర్భంగా సభకు బయల్దేరిన బస్సులను మండల ఎంపీడీవో జి కిషన్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కిరణ్ కుమార్, సీసీలు యాదగిరి, అనిత, దేవేంద్ర, పావని, మండల సమాఖ్య కార్యదర్శి మమత, కోశాధికారి ఆబెద, వివోఏలు వెంకన్న, రమాదేవి, కరుణశ్రీ, స్వప్న, మంగమ్మ, యాకలక్ష్మి తదితరులు ఉన్నారు.

## మాజీ మంత్రి వివాహ దినోత్సవ వేడుకలు




రాయపర్తి, మార్చి12(జర్నలిస్ట్ వార్త): రాయపర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఉషమ్మ దంపతుల వివాహ దినోత్సవ వేడుకలు బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మునవత్ నర్సింహా నాయక్, ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, జిల్లా పార్టీ నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ నయీమ్, రాయపర్తి మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, ఎంపీటీసీ లు బిల్లా రాధికసుభాష్ రెడ్డి, ఐత రాంచందర్,మండల పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు చెవ్వు కాశీ నాథం, మండల పార్టీ నాయకులు పోగులకొండ వేణు, సంకినేని ఎల్లస్వామి, చందు సతీష్, ఐత రవి, పీరని రాజు, కంతుల జంపి, పోచంపల్లి రాకేష్, కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ లో చేరిన బిఆర్ఎస్ నేతలు



రాయపర్తి, మార్చి12(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే సంగతి తెలిసిందే. మంగళ రాయపర్తి మండలంలోని బిఆర్ఎస్ పార్టీకి ఎంపీటీసీ లు చిర్ర ఉపేంద్ర, బానోత్ శ్వేతాసుభాష్, చిక్కొండ రంజితవిరస్వామి, గాడిపెల్లి వెంకన్న, భూక్య గోవిందా నాయక్ బిఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సిరెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త పాత తేడా లేకుండా కార్యకర్తల అందరూ కలిసి కట్టుగా పని చేసి పార్టీ ప్రతిష్టను కాపాడాలి, అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి పనిచెయ్యాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ ఒక్కరూ సమిష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు హమ్యా నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, పాలకుర్తి ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, డైరెక్టర్ పెండ్లి మహేందర్ రెడ్డి, ముఖ్య నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, ముద్రబోయిన వెంకన్న, రెంటాల గోవర్ధన్ రెడ్డి, మందాటి సుదర్శన్ రెడ్డి, ఎనగందుల మురళి, నంగునూరి అశోక్, ఎసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఇల్లందుల భగవాన్, చిన్నపాక ఎల్లయ్య, వివిద మండల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## ఖమ్మంలో సోనూ సూద్ కూరగాయల దుకాణం.. యాక్టర్ ట్వీట్ వైరల్




(జర్నలిస్ట్ వార్త):కరోనా కష్ట కాలంలో బాలీవుడ్ యాక్టర్ సోనూ సూద్ ఎంతోమందిని ఆదుకున్నాడు.. సొంత డబ్బులు ఖర్చు చేసి సాయం చేశాడు. అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి మరీ ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచాడు. తెరపై విలన్ గా కనిపించినా నిజజీవితంలో హీరోనని చాటుకున్నారు. ఆయన సేవలు అందుకున్న వారు వివిధ రకాలుగా తమ కృతజ్ఞత చాటుకుంటున్నారు. తాజాగా ఖమ్మంలో ఓ మహిళ సోనూ సూద్ పేరుతో కూరగాయల దుకాణం ప్రారంభించింది. ఆ దుకాణంలో కూరగాయలు కొన్న వారు షాపు ఫొటో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. ఈ ఫొటో వైరల్ గా మారి సోనూ సూద్ వరకూ చేరింది.దీంతో ఆయన ఈ ఫొటోను రీట్వీట్ చేస్తూ.. ఇప్పుడు నాకు కూరగాయల షాప్ కూడా ఉందంటూ కామెంట్ పెట్టారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ ట్వీట్ వైరల్ గా మారింది. నెటిజన్లు తమ కామెంట్లలో ఆయనపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ప్రతీ ఒక్కరి గుండెల్లో మీరు కలకాలం నిలిచి ఉంటారని ఓ నెటిజన్ కామెంట్ పెట్టగా.. ఇండియా మొత్తం మిమ్మల్ని ప్రేమిస్తోందంటూ మరో నెటిజన్ కామెంట్ చేశాడు. మీపై ఉన్న ప్రేమకు ప్రతిరూపం ఆ దుకాణం అని, ఈ గౌరవానికి మీరు వందశాతం అర్హులంటూ మరొకరు కామెంట్ పెట్టారు.


# మారిషస్‌లో మహాత్మాగాంధీకి భారత రాష్ట్రపతి ముర్ము నివాళులు



**(జర్నలిస్ట్ వార్త):** పోర్టులూయిస్ : చారిత్రక దండి సత్యాగ్రహ వార్షికోత్సవం సందర్భంగా మారిషస్‌లో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం సందర్శించి, మహాత్మునికి నివాళులు అర్పించారు. 1930 మార్చి 12 నుంచి ఏప్రిల్ 5 వరకు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా మహాత్మాగాంధీ శాసనోల్లంఘన ఉద్యమం చేపట్టారు. అహ్మదాబాద్ లోని సబర్మతీ ఆశ్రమం నుంచి కోస్తా తీర గ్రామం దండి వరకు దండియాత్ర సాగించి ఉప్పు సత్యాగ్రహాన్ని నిర్వహించారు. అందుకనే మార్చి 12 మంగళవారం చారిత్రక దినంగా గుర్తింపు పొందింది.మారిషస్‌లో మూడు రోజుల పర్యటనకు ముర్ము విచ్చేసారు. మారిషస్ లోని మోకాలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ వద్ద పౌరస్వాగత సభ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మహాత్మాగాంధీ సార్వజనీన ఆదర్శాలను గుర్తు చేసుకున్నారని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. మంగళవారం మారిషస్ జాతీయ దిన వార్షికోత్సవం కావడంతో ముర్ము ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ మెట్రో స్టేషన్ వరకు మెట్రో రైలులో కొద్దిసేపు ప్రయాణించారు. భారత సహాయ ప్రాజెక్టు అయిన మారిషస్ మెట్రో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది. 2019లో ప్రధాని మోడీ, మారిషస్ ప్రీమియర్ ప్రవింద్ జుగ్‌నాథ్ కలిసి ఉమ్మడిగా మారిషస్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌తోపాటు , ఆస్పత్రిని వీడియో ద్వారా ప్రారంభించారు.

# హుస్సేన్‌సాగర్ అలలపై లేజర్ ఆధారిత సౌండ్ అండ్ లైట్ షో

**ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సంజీవయ్య పార్క్‌లో లైట్ అండ్ షో ను ప్రజలకు అంకితం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి,**



హైదరాబాద్, **(జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్ భారతదేశంలోని అత్యుత్తమ పర్యాటక ప్రాంతాల్లో ఒకటని, అందుకే భాగ్యనగరాన్ని చూడటానికి వచ్చే పర్యాటకులకు అపూర్వమైన అనుభూతిని అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో నగరవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలు చేపట్టామన్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇందులో మనం ప్రారంభించుకుంటున్న లేజర్ షో ఒకటన్నారు. కేంద్ర పర్యాటక శాఖ సెంట్రల్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీమ్ లో భాగంగా.. రూ.50 కోట్లతో ఈ షోను ఏర్పాటుచేసుకున్నామని, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ.. ఈ ప్రాజెక్టును ఆకర్షణీయంగా రూపొందించిందని తెలిపారు.తెలంగాణ నుంచి మొదలైన కోహినూర్ కథ.. భిన్న సంస్కృతులు, వివిధ ఖండాలను దాటి చేసి ప్రయాణాన్ని వాటర్ స్క్రీన్ పై రంగుల రంగుల లేజర్ వెలుతురులో వివరించనున్నారు. ఈ కథను రాజ్యసభ ఎంపీ, సినీ రచయిత శ్రీ విజయేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో.. ప్రముఖ రచయిత ఎస్ఎస్ నుంచి రాశారు. ప్రముఖ నేపథ్య గాయని (ప్లే బ్యాక్ సింగర్) సునీత గాత్రాన్ని అందించగా.. ప్రముఖ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని అందించా రు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో.. అక్కడి చారిత్రక ప్రాధాన్యతను వివరిస్తూ.. సౌండ్ అండ్ లైట్ షోస్ ఉన్నాయి.కానీ.. ఓ చెరువు అలలపై లేజర్ ఆధారిత సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేయడం దేశ చరిత్రలోనే ఇది మొదటిసారని,కోహినూర్ కథతోపాటుగా.. తెలంగాణ కథ, ఇక్కడి సంస్కృతి, దేశ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఈ షోను డిజైన్ చేశారన్నారు. ఈ షో పర్యాటకులను అమితంగా ఆకట్టుకోనుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులో..మ్యూజికల్ ఫౌంటేన్ సిస్టమ్.. (ఇంటెలిజెంట్ లైటింగ్)ప్రొజెక్షన్ సిస్టమ్, ఆడియో సిస్టమ్, షో కంట్రోల్ సిస్టమ్, ఆర్టి-స్టిక్ డైరెక్షన్, కంటెంట్, ఆర్ట్ ప్రొడక్షన్ 500 మంది కూర్చునేలా ఏర్పాట్లుఫౌంటేన్ ఫ్లోటింగ్ స్ట్రక్చర్, ఫౌంటేన్ ఇన్-స్టలేషన్, ఫ్లోటింగ్ స్ట్రక్చర్, అడ్వయిర్టయిజ్ మెంట్, సైనేజ్, ప్రచార సామాగ్రి, రూఫ్ టాప్ ఓపెన్ గ్లాస్ రెస్టారెంట్, ఇతర వసతులున్నాయని,వీటన్నింటి ద్వారా ఈ ప్రాంత చరిత్రను ఆడియో, విజువల్ మీడియా ద్వారా ఆక్వా స్క్రీన్ ప్రొజెక్షన్ మ్యాపింగ్ తో అందంగా చూపిస్తారని తెలిపారు.దీనికి ఫౌంటేన్ షో సింక్ర-నైజ్, చేసి.. చక్కటి మ్యూజిక్ కూడా జోడిరచడంతో షో చాలా అట్రాక్టివ్‌గా ఉంది.ఇలాంటి లేజర్ షోలు, సౌండ్ అండ్ లైట్ షోలు, ఇల్యుమినేషన్ ప్రాజెక్టులు మన చరిత్రను, మన సంస్కృతిని తెలియజేసేందుకు చాలా అవసరముందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

# అరుణాచల్ ప్రదేశ్ మాదే..

## చైనాకు భారత్ గట్టి చురక






**(జర్నలిస్ట్ వార్త):** న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ ఇటీవల అరుణాచల్‌ప్రదేశ్‌లో పర్యటించడంపై చైనా తన అక్కసు వెళ్లగక్కడం తెలిసిందే.' జాంగ్‌నన్' ప్రాంతం తమ భూభాగమని, అక్కడ భారత్ వేస్తోన్న అడుగులు సరిహద్దు వివాదాన్ని మరింత సంక్లిష్టం చేస్తాయని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి వాంగ్ వెన్‌బిన్ నోరు పారేసుకున్నారు. ఈ విషయమై న్యూఢిల్లీతో దౌత్యపరంగా నిరసన తెలియజేసినట్లు ఆయన తెలిపారు.దీంతో ఈ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ దీటుగా సమాధానమిచ్చింది.' ప్రధాని మోడీ అరుణాచల్ ప్రదేశ్ పర్యటనను ఉద్దేశిస్తూ చైనా చేసిన వ్యాఖ్యలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. భారత్‌లోని ఇతర రాష్ట్రాల్లో మాదిరిగానే అరుణాచల్‌లోనూ మా నేతలు పర్యటనలను చేపడతారు. ఈ పర్యటనలను వ్యతిరేకించడం, భారత అభివృద్ధి ప్రాజెక్టులపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం సహేతుకం కాదు. ఇది వాస్తవాలను ఏమాత్రం మార్చదు. అరుణాచల్‌ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. ఈ విషయాన్ని చైనాకు ఇప్పటికే అనేక సార్లు స్పష్టంగా చెప్పాం' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం అధికారిక ప్రకటనలో తెలిపారు.అరుణాచల్‌ప్రదేశ్‌లో ప్రధాని మోడీ ఇటీవల పర్యటించిన విషయం తెలిసిందే. చైనా భారత్ సరిహద్దుల్లోని తవాంగ్‌కు సైనిక బలగాలను, సాయుధ సంపత్తిని తరలించేందుకు ఉపయోగపడే ' సేలా 'సొరంగమార్గాన్ని ఆయన ప్రారంభించారు.అయితే ఈ రాష్ట్రాన్ని చైనా 'జాంగ్‌నన్'( దక్షిణ టిబెట్)గా పేర్కొంటోంది. ఈ క్రమంలోనే మోడీ పర్యటనపై అక్కసు వెళ్లగక్కింది. అది తమ భూభాగమేనంటూ మళ్లీ పాత పాటే పాడింది.

# ప్రయాణికుల సేవలో వందేభారత్!

**అందుబాటులో మరో రెండు రైళ్లు**

**సికింద్రాబాద్ నుంచి విశాఖకు**

**విశాఖ నుంచి పూరికి కొత్త రైళ్లు..**

**10 వందే భారత్‌లను వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ**

**గుజరాత్ నుంచి 85 వేల కోట్ల రైల్వే పనులకు శ్రీకారం**



**(జర్నలిస్ట్ వార్త):** దక్షిణ మధ్య రైల్వే విభాగంలో మంగళవారం మరో రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు పట్టాలెక్కాయి. సికింద్రాబాద్-విశాఖ మధ్య ఇప్పటికే ఈ రైలు నడుస్తుండగా.. మంగళవారం నుంచి మరొకటి అందుబాటులోకి వచ్చింది. అలాగే విశాఖ నుంచి పూరికి వెళ్లే వందేభారత్ తో పాటు ఈ రైల్వే పరిధిలోని కొన్ని స్టేషన్లను కలుపుతూ కలబురగి-బెంగళూరు మార్గంలో కొత్త ఎక్స్‌ప్రెస్ రైలుకు ప్రధాని మోదీ మంగళవారం పచ్చజెండా ఊపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి మోదీ మొత్తం 10 వందేభారత్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం ఈ రైళ్ల సంఖ్య 50 దాటడం విశేషం.ఇదే సందర్భంగా రూ.85వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు/ప్రారంభోత్సవాలు చేశారు. వీటిలో కొన్నింటిని జాతికి అంకితం చేశారు. దక్షిణమధ్య రైల్వే పరిధిలో 9 పీఎం గతిశక్తి కార్గో టెర్మినళ్లు, 11 గూడ్స్ షెడ్లు, రెండు జన ఔషధి కేంద్రాలు, 3 రైల్వే కోచ్ రెస్టారెంట్లను ప్రధాని నేడు ప్రారంభించి జాతికి అంకితం చేశారు. కొల్లం-తిరుపతి మెయిల్ ఎక్స్‌ప్రెస్, పలు మార్గాల్లో రెండో లైను, మూడో లైను, గేజు మార్పిడి, బైపాస్ లైన్లను ప్రారంభించారు.

### 51కి చేరిన వందేభారత్‌లు..

సికింద్రాబాద్-విశాఖ, కలబురగి-బెంగళూరుతో పాటు లఖ్‌నవూ-దేహ్రాదూన్, పట్నా-లఖ్‌నవూ, న్యూ జల్‌పాయ్‌గుడి-పట్నా, పూరి-విశాఖపట్నం, రాంచీ-వారణాసి, ఖజురహో-దిల్లీ, అహ్మదాబాద్-ముంబయి, మైసూరు-చెన్నై మార్గాల్లో మొత్తం 10 రైళ్లను ప్రధాని నేడు ప్రారంభించారు. దీంతో దేశంలో మొత్తం వందేభారత్‌ల సంఖ్య 51కి చేరింది. ఇవి 45 మార్గాల్లో పరుగులు తీస్తున్నాయి. అత్యధికంగా దిల్లీ గమ్యస్థానానికి దేశంలోని పలు ప్రాంతాల నుంచి పది వందేభారత్‌లు అందుబాటులో ఉన్నాయి.

### మోదీ పాలనలో రైల్వేలలో గణనీయమైన అభివృద్ధి: కిషన్ రెడ్డి



పదేళ్లలో దేశంలో రైల్వే గణనీయమైన అభివృద్ధి సాధించిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల పట్ల మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని అర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టారని కొనియాడారు. అహ్మదాబాద్ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ సికింద్రాబాద్ %--% విశాఖ మార్గంలో రెండో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కిషన్ రెడ్డి, వర్చువల్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ.. ఇవాళ మరో ఎక్స్‌ప్రెస్‌ను మోదీ ప్రారంభించడం సంతోషకరమన్నారు. చర్లపల్లి టెర్మినల్ పనులు 90 శాతం పూర్తయ్యాయని.. మరికొద్ది రోజుల్లోనే ప్రారంభిస్తామని చెప్పారు.

# కావాలనే చిన్నపీటపై కూర్చున్నా




**నాకు ఎలాంటి అవమానం జరగలేదు సోషల్ మీడియాలో అర్థం లేని వ్యాఖ్యలు**

**సింగరేణిలో ఈ ఏడాది 1900 ఉద్యోగాలు భర్తీ : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క**

**(జర్నలిస్ట్ వార్త):** /హైదరాబాద్ : డిప్యూటీ సిఎంగా రాష్ట్రాన్ని శాసిస్తున్నాను, నేనెవరికో తల వంచే వాడిని కాదు, ఎవరో పక్కన కూర్చోబెడితే కూర్చునేవాడిని కాదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బంజారాహిల్స్‌లోని రోడ్డు నం. 12లో జరిగిన సింగరేణి గెస్ట్ హౌస్ శంకు స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం యాదాద్రి దేవాలయంలో జరిగిన సంఘటనపై ఆయన స్పందిస్తూ.. ఆత్మగౌరవాన్ని చంపుకునే మనస్తత్వం నాది కాదు. నేను కావాలనే యాదాద్రి దేవాలయంలో వేద పండితుల ఆశీర్వచన సమయంలో చిన్న పీట మీద కూర్చునట్లు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో నా నిర్ణయాలే కీలకమన్న ఆయన ఆర్థిక విద్యుత్తు ప్రణాళిక శాఖలకు ఉప ముఖ్యమంత్రి తాను వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. ఆ ఫోటోతో కావాలనే ట్రోల్ చేస్తున్నారని, వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నా అన్నారు. సింగరేణి కాలరీస్‌కి సంబంధించి 134 సంవత్సరాల చరిత్ర గల సింగరేణి సంస్థకు హైదరాబాద్‌లో సొంత గెస్ట్ హౌస్ లేదని, రాష్ట్ర ప్రభుత్వం వారు సొంత గెస్ట్ హౌస్ కోసం వెయ్యి గజాల స్థలాన్ని కేటాయించడమే కాక శంకుస్థాపనకు విచ్చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సింగరేణి కాలరీస్‌కి సంబంధించిన జిల్లా అయిన ఖమ్మం చెందిన వ్యక్తి గా ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.

ఈ ఏడాదిలో సింగరేణిలో 1900 ఉద్యోగాలు భర్తీ చేస్తాం

సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ ఏడాదిలో సింగరేణి ఆధ్వర్యంలో దాదాపు 1900 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తెలిపారు.ఇందులో భాగంగా గత వారంలో 489 ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ అయ్యాయని.. మరో 1352 ఉద్యోగాల భర్తీకి అతి త్వరలో నోటిఫికేషన్లు విడుదల కానున్నట్లు ఆయన ప్రకటించారు. సింగరేణి విస్తరణ చర్యల్లో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జైపూర్ లో నిర్వ హిస్తున్న ప్రస్తుత 1200 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో త్వరలో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా రామగుండంలో ఉన్న జెన్ కో ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం నిర్మించిన ప్లాంట్ ఆవరణలో 800 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలో ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో సింగరేణి థర్మల్ సామర్థ్యం 2800 మెగావాట్లకు చేరుతుందన్నారు. అలాగే సింగరేణి సుస్థిర భవిష్యత్ కోసం, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం కొత్త గనులను ఏర్పాటు చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. సింగరేణి ఆధ్వర్యంలోని రాష్ట్రంలోని భారీ జలాశయాలపై ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లు, ఓపెన్ కాస్ట్ లపై పవన విద్యుత్ వంటివి ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు చేస్తున్నామన్నారు. సింగరేణి సమస్యలపై మానవీయ కోణంలో ముందుకు వెళ్తున్నామని%ొ% తాము తీసుకునే నిర్ణయాలన్నీ సింగరేణి ఉజ్వల భవిష్యత్కు బాటలు వేసేవిగానే ఉంటాయన్నారు. సింగరేణి సంపదను పెంచడమే తమ లక్ష్యమని.. అలా పెంచిన సంపదను కార్మికులకు పంచడమే ధ్యేయమని ప్రకటించారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తుందనీ, ఈ సంస్థను అభివృద్ధి చేయడం, కొత్త ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ లైజన్ ఆఫీసర్లు ఉన్న మాదిరిగానే బీసీ లైజనింగ్ ఆఫీసర్ నియామకాన్ని చేపట్టేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. గత 100 రోజుల్లో సింగరేణిలో కార్మికుల సంక్షేమానికి, సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అనేక కార్యక్రమాలను చేపట్టినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సంస్థను దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబు, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మీ, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు వివేక్, వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేమ్ సాగర్ రావు, సింగరేణి ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్, మాజీ ఎంపీ, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ అజారుద్దీన్, ప్రాతినిధ్య సంఘ నాయకులు జనక్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

# మరోసారి డీప్‌ఫేక్ బారిన పడ్డ రష్మిక మందన్న..



%నేషనల్ క్రష్ రష్మిక మందన్న మరోసారి డీప్‌ఫేక్ బారిన పడింది. ఈసారి ఆమె వీడియోను దుండగులు మరింత అసభ్యకరంగా ఎడిట్ చేసి పెట్టారు. ఈ వీడియోలోనూ కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా ఆమె ముఖాన్ని మార్ఫింగ్ చేశారు. ఈసారి ఇంకా చాలా క్లియర్ డీప్‌ఫేక్ వీడియోను సృష్టించడం గమనార్హం. ప్రస్తుతం ఈ డీప్‌ఫేక్ వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది.

ఇక వైరల్ అవుతున్న రష్మిక డిప్‌ఫేక్ వీడియోలో ఓ యువతి అసభ్యకరంగా డ్యాన్స్ చేస్తూ కనిపించింది. దీనికి రష్మిక ముఖంను ఎడిట్ చేశారు. వీడియోపై పలువురు మండిపడుతున్నారు. ఈ వీడియోపై రష్మిక అభిమానులు తమదైనశైలిలో స్పందిస్తున్నారు. పోలీసులు ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంటున్నారు. ఇలాంటి వాటిని ఆపాలని కోరుతున్నారు. రష్మిక డీప్‌ఫేక్ వీడియోలు చేయొద్దని కొందరు హెచ్చరిస్తున్నారు. వరుస చిత్రాలతో తనకంటు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న రష్మికకి ఇలాంటివి ఎదురుకావడం బాధాకరమనే చెప్పాలి.


కాగా, అల్లు అర్జున్‌తో చేసిన 'పుష్ప' మూవీతో ఆమెకు పాన్ ఇండియా ఇమేజ్ దక్కింది. ఆ తర్వాత ఇటీవలే రష్మిక మందన్న బాలీవుడ్ మూవీ 'యానిమల్'తో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకుంది. ఇలా బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న ఆమెకు డీప్‌ఫేక్ వీడియోలు తలనొప్పిగా మారుతున్నాయి. ప్రస్తుతం ఆమె 'పుష్ప-2', 'ది గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్ బో' వంటి చిత్రాలతో బిజీగా ఉంది. అలాగే యానిమల్ సీక్వెల్ 'యానిమాల్ పార్క్'లోనూ ఆమె నటించనుందని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా వెల్లడించారు.

# రాశి ఖన్నా.. ఈసారి కొట్టాల్సిందే పాప!



ఢిల్లీ అమ్మాయి రాశీ ఖన్నా.. హిందీ మూవీ మద్రాస్ కేఫ్ తో నటిగా కెరీర్ స్టార్ చేసింది. మనం మూవీతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ.. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు హీరోయిన్ గా మారింది. అప్పటి నుంచి వరుస తెలుగు సినిమాల్లో నటించింది. మధ్యమధ్యలో ఓ మలయాళ, కొన్ని తమిళ చిత్రాలతో అలరించింది. ప్రస్తుతం నార్త్ లో తన సత్తా చాటుతోంది. ఇటీవల వెబ్ సిరీస్ లు రుద్ర, ఫర్జీతో ఆకట్టుకుంది. టాలీవుడ్ లో చివరగా పక్కా కమర్షియల్ సినిమాతో సందడి చేసిన బ్యూటీ.. ఆ తర్వాత ఇప్పటి వరకు కనిపించలేదు. బాలీవుడ్ మూవీతో సినీ కెరీర్ స్టార్ట్ చేసిన రాశి.. పదేళ్ల తర్వాత మళ్లీ హిందీ సినిమాతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె యోధ మూవీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాతో గట్టి హిట్ కొట్టాలని రాశీ ఖన్నా భావిస్తోంది. రాశీ ఖన్నా కెరీర్ కు తిరుగుండదని సినీ పండితులు చెబుతున్నారు. బడా ప్రాజెక్టుల ఛాన్సులు దక్కించుకోనుందని అంటున్నారు. అయితే రాశీ ఖన్నానే కాదు.. సిద్ధార్థ్ మల్హోత్రా కూడా గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. ఆయన నటించిన థాంక్స్ గాడ్, జెంటిల్ మెన్, మార్జావాన్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ అయ్యాయి. ఇప్పుడు ఈ మూవీ పైనే ఆయన ఆశలు పెట్టుకున్నారు. యోధ మూవీలో సిద్ధార్థ్ మల్హోత్రా అవుట్ అండ్ అవుట్ యాక్షన్ రోల్ చేశారు. కమాండోగా భారీ యాక్షన్ సీక్వెన్స్ లు చేసినట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. రాశీ ఖన్నా ఎయిర్ పోర్ట్ ఆఫీసర్ రోల్ లో కనిపించనుందని తెలుస్తోంది. మరో హీరోయిన్ దిశా ఎయిర్ హోస్టెస్ గా కనిపించనున్నారు. సాగర్ అంబ్రే, పుష్కర్ ఓఝా దర్శకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాను కరణ్ జోహార్ నిర్మించగా.. అపూర్వ మెహతా, శశాంక్ ఖైతాన్ సహ నిర్మాతలుగా వ్యవహరించారు. కరణ్ జోహార్ వంటి బడా నిర్మాతలు యోధకు మద్దతు ఇవ్వడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టే అవకాశం ఉంది. మరి ఈ సినిమా అటు సిద్ధార్థ్ మల్హోత్రాతో పాటు ఇటు రాశీ ఖన్నాకు ఎలాంటి ఫలితం ఇస్తుందో చూడాలి.

# డిఫరెంట్ కంటెంట్ తో 'శివం భజే'




అశ్విన్ బాబు హీరోగా మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మాణంలో తెరకెక్కుతున్న సినిమా టైటిల్ ను కొంతసేపటి క్రితం ప్రకటించారు. గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ పై, ప్రొడక్షన్ నంబర్ 1 గా ఈ సినిమా నిర్మితమవుతోంది. అప్సర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకి 'శివం భజే' అనే టైటిల్ ను ఖరారు చేయడం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో దిగాంగనా సూర్యవన్షి కథానాయికగా నటిస్తోంది. ఈ సందర్భంగా ఈ సినిమా నిర్మాత మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "అశ్విన్ హీరోగా ఒక వైవిధ్యమైన కథతో మా సంస్థ మొదటి నిర్మాణంగా 'శివం భజే' తెరకెక్కుతోంది. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న న్యూ ఏజ్ సినిమా ఇది. కామెడీ, డ్రామా, యాక్షన్ థ్రిల్స్ తో ఆద్యంతం ఉత్కంఠ భరితంగా ఉంటుంది" అని అన్నారు.దర్శకుడు అప్సర్ మాట్లాడుతూ, " మా కథకి సరిగ్గా సరిపోయే టైటిల్ 'శివం భజే' దొరకడం చాలా సంతోషంగా ఉంది. 80% షూటింగ్ పూర్తి చేసుకుని రిలీజ్ వైపు అడుగులు వేస్తున్నాం. మా హీరో అశ్విన్ బాబు, బాలివుడ్ నటుడు అర్బాజ్ ఖాన్, తమిళ నటుడు సాయి ధీనా, హైపర్ ఆది, మా నిర్మాత మహేశ్వర రెడ్డి గారు చాలా సహకరించారు. సాంకేతికంగా ఎక్కడా తగ్గకుండా చిత్రాన్ని భారీగా తెరకెక్కిస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకులకి తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు.

# శోభిత గ్లామర్ ఔట్ స్టాండింగ్



శోభితా ధూళిపాళ్ల.. ఈ పేరు తెలియని మూవీ లవర్స్ బహుశా ఉండరేమో. ఆంధ్రప్రదేశ్లో పుట్టి పెరిగిన ఈ అమ్మడు.. ఇప్పుడు హాలీవుడ్ లో కూడా ఆఫర్లు దక్కించుకుంటూ తన సత్తా చాటుతోంది. తెనాలి ముద్దుగుమ్మ అయిన శోభిత.. బాలీవుడ్ ద్వారా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. 2016లో రామన్ రాఘవ్ 2.0 మూవీతో తొలిసారి ప్రేక్షకుల ముందుకు వచ్చి తన యాక్టింగ్ తో అందరినీ ఆకట్టుకుంది. ఇక అడవి శేష్ మేజర్ తో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి.. ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ దక్కించుకుంది. కేవలం బాలీవుడ్, టాలీవుడే కాకుండా.. మిగతా భాషల్లో సినిమాలు చేసింది. మలయాళ, తమిళ చిత్రాల్లో నటించి సౌత్ లో స్టార్ హీరోయిన్ గా పేరు సంపాదించుకుంది. పొన్నియన్ సెల్వన్ రెండు పార్టుల్లో మహారాణిగా ఆకట్టుకుంది.. ఓవైపు సినిమాల్లో ఫుల్ బిజీగా ఉంటూనే.. మరోవైపు సోషల్ మీడియాలో కూడా సందడి చేస్తుంటోంది. డైలీ అప్డేట్స్ ఇస్తూ తన ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటోంది. క్రేజీ ఔట్ ఫిట్స్ లో కిక్కిచ్చే పోజులు ఇస్తుంటోంది. రకరకాల స్టిల్స్ తో కుర్రకారును మైమరపిస్తుంటోంది. చీరల్లో నెట్టింట హీట్ పుట్టిస్తుంటోంది. చీరల్లో కూడా గ్లామర్ షో చేయొచ్చని ప్రూవ్ చేస్తుంటోంది. తాజాగా ఈ బ్యూటీ ఇంగ్లీష్ బ్రైడ్స్ టుడే మ్యాగ్ జైన్ పై దర్శనమిచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని శోభిత రీ పోస్ట్ చేసింది. దాంతోపాటు కొన్ని పిక్స్ షేర్ చేసింది. అందులో వైట్ కలర్ డిజైనర్ ఫ్రాక్ లో తన పోజులతో కుర్రకారు గుండెల్లో హీట్ పుట్టిస్తోంది. మత్తెక్కించే కళ్లతో కైపుగా చూస్తూ క్లీన్ బౌల్డ్ చేస్తోంది. ఔట్ స్టాండింగ్ స్టిల్స్ తో నెటిజన్లు కట్టి పడేస్తోంది. ఎద అందాలు చూపిస్తూ ఫిదా చేస్తోంది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. సో బ్యూటిఫుల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఏదేమైనా శోభిత అందాలకు పక్కాగా ఫిదా అవ్వాల్సిందేంటూ రచ్చ రచ్చ చేస్తున్నారు. తమ కామెంట్లతో బ్యూటీని ఇంకా ఎంకరేజ్ చేస్తున్నారు. శోభిత గ్లామర్ కు హాలీవుడ్ టు టాలీవుడ్ అంతా ఫ్యాన్సేనని అంటున్నారు.